తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- మండల సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్నఎమ్మెల్యేవం శీకృష్ణ

లింగాల, ఏప్రిల్ 19 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్త కుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లింగమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు ఎజెండాను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో అధికారులపై మరింత బాధ్యత పెరిగిందని, తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి ముందస్తుగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

జాతీయ ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డులు లేని వారికి జాబ్‌కార్డు ఇచ్చి పని కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, ఎంపీడీవో ఆంజనేయులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

వెల్దండ, ఏప్రిల్ 19: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వెల్దండ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం అవసరమన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ నిఘా పటిష్టం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై రవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

ముకురాలలోన ర్సరీనిప రిశీలిస్తున్నఎం పీడీవోవెం కట్రాములు

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 19: ప్రతి ఇంటి ముందు తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీవో వెంకట్రాములు సూచించారు. శుక్రవారం ఆయన కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఉపాధ్యాయుల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతూ గ్రామంలో రోడ్లపైకి నీరు పారనివ్వకుండా ఇంటి యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే జలసంరక్షణ గురించి వివరించి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అంజలి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ, ఏప్రిల్ 19: మండలంలోని చెర్కూర్ మాజీ ఉప సర్పంచ్ నర్సింహ తండ్రి లింగయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్, మైసయ్య, శ్రీను, కొండల్ తదితరులు ఉన్నారు.

పరామర్శిస్తున్న గోళి శ్రీనివాస్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

WANTED
★హైదరాబాద్‌లో ఆర్థికంగా స్థిరపడడానికి అద్భుత అవకాశం కష్టపడి పనిచేసే వారికి మంచి సంపాదన, ఫ్రీ వసతి + భోజనం కలదు. ఫోన్: 8121748850
NT-340525

WANTED TEACHERS
★RBVRR Reddy Model High School (English Medium), NH-44, Williamkonda, Kothakota (Mdl), Wanaparthy Dist., requires Qualified and Experienced Teachers for all subjects for classes 5th to 10th. Boarding & Lodging provided. Mail your Resume to : rbvrrmhs1995@gmail.com contact No. 7032039346
NT-311989

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- స్త్రీ,శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణి రాజేశ్వరి
- దివ్యాంగులకు ఓటింగ్ పై అవగాహన

ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న స్త్రీ,శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణి రాజేశ్వరి

కొల్లాపూర్, ఏప్రిల్ 19 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై దివ్యాంగులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంట్లోనే తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవకాశం కల్పించిందన్నారు. దివ్యాంగులందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్డీవో, ఏపీడీ, సీడీపీవో వెంకటరమణ, ఏసీడీపీవో అనంతలక్ష్మి, సూపర్‌వైజర్లు, దివ్యాంగులు పాల్గొన్నారు.

మన్ననూర్‌లో ఉపాధి కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డీఆర్డీవో చిన్న ఓబులేశ్

ఉపాధి కూలీలకు అవగాహన

అమ్రాబాద్, ఏప్రిల్ 19 : ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్డీవో చిన్న ఓబులేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటేశ్వర్లబావి, మన్ననూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా ఓటు హక్కుపై కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ఓటు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి మొక్కలకు నీటిని సకాలంలో అందించాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌లాల్, ఏపీవో రఘు, టీఏ వెంకటేశ్వర్లు, ఎఫ్ఏ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్

తిమ్మాజిపేట, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని టీఎస్‌బీసీఎల్ స్టాక్ పాయింట్‌ను ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలను పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లో కొన్ని లిక్కరు, బీరు కంపెనీలకు చెందిన స్టాక్‌ను రేషన్ పద్ధతిలో ఇస్తుండడంపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 19: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ శుక్రవారం కల్వకుర్తి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి కావ్య తీర్పు వెలువరించినట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన వరికుప్పల రాజుకు ఐదు రోజుల జైలు శిక్ష రూ. 500 జరిమానా , ఆమనగల్లు మండలం శాంతినగర్‌కు చెందిన తాళ్ల రమణకు రెండు రోజుల జైలు శిక్ష రూ. 500 జరిమానా విధించినట్లు ఎస్సైతెలిపారు. మద్యంతాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని వాహనదారులను ఎస్సై హెచ్చరించారు.

కూలీల సమస్యల పరిష్కారానికి కృషి

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 19 : ఉపాధి కూలీల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని అచ్చంపేట ఎంపీడీవో బాలచందర్ సృజన్ సూచించారు. శుక్రవారం మండలంలోని హజీపూర్, చెన్నారం గ్రామాల్లో చేస్తున్న పని ప్రదేశానికి వెళ్లి కూలీలకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పనులు చేస్తే కనీస దినసరి వేతనం రూ.300 ఉపాధి కూలి పొందవచ్చని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఈసీ భాస్కర్, హజ్రత్ బేగం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

తాడూరు, ఏప్రిల్ 19 : రాష్ట్ర ప్రభుత్వం జీవో 317ను పరిష్కరించి ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలని బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు శుక్రవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎనిమిది సంవత్సరాలుగా ప్రమోషన్లు లేక ఎంతో మంది ఉపాధ్యాయులు తమ అమూల్యమైన సర్వీసును కోల్పోయి ఉద్యోగ విరమణ పొందుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

తిమ్మాజిపేట, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని ఇఫ్‌కో బజార్‌లో ఫర్టిలైజర్‌ను మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. బజార్‌లో ఉన్న స్టాక్, రికార్డులో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. రైతుల పూర్తి వివరాలను నమోదు చేయాలని, ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులు, విత్తనాలను విక్రయించాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో ఉన్నారు.

స్తంభాలకు తీగలు అమర్చాలి

కొల్లాపూర్, ఏప్రిల్ 19 : మండలంలోని నార్లాపూర్ ఎస్సీ కాలనీలో శ్మశానవాటిక సమీపంలో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ స్తంభాలకు వెంటనే తీగలను అమర్చాలంటూ శుక్రవారం తెలంగాణ మాదిగ దండోరా సంఘం జిల్లా అధ్యక్షుడు డాకే మాదిగ ట్రాన్స్‌కో ఏఈ రాకేశ్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. స్తంభాలకు విద్యుత్ తీగను లాగకపోవడంతో కాలనీవాసులు చీకటిలో మగ్గుతున్నారని ఆయన పేర్కొన్నారు.

బెల్టు షాపులను ఎత్తి వేయాలి

కోడేరు, ఏప్రిల్ 19 : మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వెలసిన అక్రమ మద్యం, నాటుసారా కేంద్రాలు, బెల్టుషాపులను తొలగించాలని డీవైఎఫ్ఐ కోడేరు మండల కార్యదర్శి శివశంకరవరప్రసాద్ అన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపులను వెంటనే ఎత్తివేసే విధంగా చర్యలు చేపట్టాలని శుక్రవారం స్థానిక డిప్యూటీ తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచ్చల విడిగా వెలసిన బెల్టు షాపులతో యువకులు మద్యానికి బానిసై ఆర్థికంగా తీవ్ర నష్టపోతున్నారన్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి బెల్టుషాపులను నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శ్రీశైలం, రాము, కార్తీక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తి, ఏప్రిల్ 19: కల్వకుర్తి పట్టణం బాలరాంనగర్‌కు చెందిన తిరుపతిరెడ్డికి శుక్రవారం మిత్రఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడైన తిరుపతిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆయనను పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

హోటల్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపకశాఖ అధికారులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 19 : జిల్లా అగ్ని మాపక కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా పట్టణంలోని హిమాలయ హోటల్‌లో అగ్ని మాపక అధికారులు సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వంట చేసేటప్పుడు హఠాత్తుగా గ్యాస్ సిలిండర్‌లో మంటలు రేగితే ఎలా నివారించాలనే దానిపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో కృష్ణమూర్తి, కురుమూర్తి, నగేశ్, జగన్‌మోహన్, ఎండీ.మహ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి పూల రథోత్సవం

చారకొండ, ఏప్రిల్ 19: మండలంలోని సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివదత్తాత్రేయ, పరశురామ, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూల రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలతో అందంగా అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి అర్చకులు, భక్తులు శ్రీరామ నమస్మరణతో రథాన్ని లాగారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఇన్‌చార్జి ఈవో శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ నిరంజన్, అర్చకులు మురళీధర్‌శర్మ, అనంతరామశర్మ, లక్ష్మణ్‌శర్మ, గోపీకృష్ణశర్మ, వేణుగోపాలశర్మ, రఘుశర్మ, జయప్రకాశ్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, కోదండరామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

పూల రథాన్ని లాగుతున్న భక్తులు

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అచ్చంపేట, ఏప్రిల్ 19 : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఉప్పునుంతల మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. తొలిసారి బండలాగుడు పోటీలను నిర్వహించడంతో అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై లెనిన్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. పోటీలను ఎమ్మెల్యే వంశీకృష్ణ తిలకించారు. మొదటి బహుమతి రూ.60వేలు జీసీఆర్ యాదిరెడ్డిపల్లి తాడూర్ మండలం, రెండో బహుమతి రూ. 50వేలు సుధాకర్‌రెడ్డి గద్వాల, మూడో బహుమతి రూ. 40వేలు సుందరప్ప పత్తికొండ, నాలుగో బహుమతి రూ. 30 వేలు రవీందర్‌రెడ్డి మానవపాడు, ఐదో బహుమతి రూ.20 వేలు గోపాలకృష్ణ చిన్నంబావి ఎద్దులు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో పెద్దజంగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంతారెడ్డి, చిన్నజంగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సరిత, బాలకృష్ణ, శేఖర్‌గౌడ్, డాక్టర్ బాల్‌నారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

లింగాల, ఏప్రిల్ 19 : కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 21 నుంచి లింగాలలో అంతర్రాష్ట్ర స్థాయి వృషభరాజుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు, రామాలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.45వేలు, ద్వితీయ రూ.35 వేలు, తృతీయ రూ.25వేలు, నాలుగో బహుమతి రూ.15 వేలు, ఐదో బహుమతి రూ.10వేలు ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా 22న సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు, 23న ట్రాక్టర్ రివర్స్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి

- పట్టించుకోని అధికారులు

పెంట్లవెల్లి, ఏప్రిల్ 19 : కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని మండల ప్రజలు అంటున్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో మండలంలో రహదారుల కిరువైపులా హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సంబంధిత అధికారులు వాటిని పట్టించ కోవడం లేదని అందుకు నిదర్శనం శుక్రవారం పెంట్లవెల్లి- జటప్రోల్ ప్రధాన రహదారి పక్కన కాలిన మొక్కలేనంటున్నారు. రెండు రోజులుగా జటప్రోల్-పెంట్లవెల్లి రహదారుల వెంట పొలాల్లో రైతులు పంట పొలాల గట్లపై పిచ్చి మొక్కలకు నిప్పు పెట్టడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న హరిత మొక్కలు కాలి బూడిదయ్యాయి. హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆరు నెలల కిందట జటప్రోల్ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై హరితహారం మొక్కలు కాలిపోయినా నేటి వరకు అధికారులు పరిశీలించకపోవడం శోచనీయ మంటున్నారు.

పెంట్లవెల్లి-జటప్రోల్ ప్రధాన రహదారిపై కాలిన హరితహారం మొక్కలు

బాధ్యులపై చర్యలు

- ఎంపీడీవో ప్రసన్న కుమారి

ఈ విషయంపై ఎంపీడీవో ప్రసన్న కుమారిని వివరణ కోరగా హరితహారం మొక్కలు ఆహుతైన ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వంగూరు, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయభాస్కర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల మండల అధికారులు సమావేశానికి సకాలంలో విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి మద్దిమడుగు అంజన్న ఉత్సవాలు

అమ్రాబాద్, ఏప్రిల్ 19: మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రంగాచారి, ఆలయకమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం యాగశాల ప్రవేశం గణపతిపూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన-ధ్వజారోహన, రాత్రి 8గంటలకు అశ్వవాహనసేవ, పార్వతీపరమేశ్వరుల కల్యాణం, సోమవారం ఉదయం ద్వాదశ వాస్తు పూజ, హోమం, మన్యూసూక్తహోమం, గవ్యాంతరపూజ, గరుడవాహనసేవ, రాత్రికి లోక కల్యాణార్థం సీతారాముల కల్యాణోత్సవం, 23వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 9గంటలకు స్వామి వారికి మహాకుంభాభిషేకం, హనుమాన్ గాయత్రీ హోమం, పూర్ణాహుతి, హనుమాన్ దీక్షదారుల మాల విరమణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులు, హనుమాన్ మాలధారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.

21న కందికొండ రామస్వామి స్మారక అవార్డు ప్రదానోత్సవం

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 19: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కార అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వనపట్ల సుబ్బయ్య, వహీద్‌ఖాన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశ హాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు కే ఆనందాచారి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ అవార్డు సాహిత్యంలో కథల విభాగం 2023 సంవత్సరానికి గానూ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి స్ఫూర్తి కందివనం రచించిన డిమ్మి కథల సంపుటికను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి కవులు, సాహిత్య అభిమానులు, విద్యార్థులు కథా రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బిజినేపల్లి, ఏప్రిల్ 19: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికులు కథనం మేరకు మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన మహేశ్ బైక్‌పై బిజినేపల్లి నుంచి తన అత్తగారి ఊరైన గంగారం గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో మహేశ్‌కు తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో బాధితుడిని నాగర్‌కర్నూల్ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సత్తా

- గురుకులానికి 11మంది ఎంపిక

కొల్లాపూర్, ఏప్రిల్ 19 : కొల్లాపూర్ మండలం చింతలపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు గురుకుల పాఠశాల ప్రవేశానికి పరీక్ష రాశారు. కాగా శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ఆ పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కర్నె కృష్ణయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం,ఉపాధ్యాయులు రబ్బానీపాషా, శంకర్‌హకీంకారి, సంగీత, అనిల్‌కుమార్, స్వప్న అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆటోలో పట్టుబడిన రేషన్ బియ్యం

కోడేరు, ఏప్రిల్ 19 : ఓ ఆటోలో అక్రమంగా 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. కోడేరులో తనిఖీలు చేస్తుండగా వనపర్తి మండలం గోపాల్‌పేటకు చెందిన దేవరాజు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడినట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యంతో పాటు ఆటోను కోడేరు పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫార్మాసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మగ్దుం

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 19 : పట్టణానికి చెందిన ఎండీ మగ్దుం ఫార్మాసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైనట్లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో అచ్చంపేటలో కమిటీ ఎంపిక నిర్వహించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని అధ్యక్షుడు మగ్దుం పేర్కొన్నారు.

గ్రామాల్లో జోరుగా ప్రచారం

బల్మూరు, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల నామినేషన్లు వేయడం ప్రారంభం కావడంతో శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు తమ పార్టీ ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి జోరుగా ప్రచారం చేస్తూ తమ అభ్యర్థులకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు.